ఉక్కు శివాలయంలో ఘనంగా రథసప్తమి పూజలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అభివృద్ధి పదంలో పయనించి లాభాల బాటలో నడవాలని కోరుకుంటు, స్టీల్ ప్లాంట్ శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం లో శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి రథసప్తమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా పూజలు సమర్పించారు. రానున్న కాలంలో ఉక్కు కార్మికులు, పరిశ్రమ అభివృద్ధి చెందాలని కాంక్షించారు. ఈ కార్యక్రమం లో యే ల్లేటి శ్రీనివాసరావు, సిహెచ్ సురేంద్ర, నడుపూరు శ్రీనివాస్, కనకరెడ్డి శశిభూషణ్, రమేష్, కాళిదాసు, విఎస్ వర్మ, నాగభూషణం మహాదేవ్ పాల్గొన్నారు.

సి.ఐ.ఎస్.ఎఫ్‌ను తొలగించడం సరికాదు

గాజువాక - విశాలాంధ్ర : విశాఖ ఉక్కు కర్మాగారం లో అతి కీలక మైన సీఐఎస్ఎఫ్ కు చెందిన 463 మంది సిబ్బంది ని తొలగించడం సరైంది కాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ ,పోరాట కమిటీ నేత వర సాల శ్రీనివాస్ రావు ఖండించారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా కూర్మ న్న పాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు మంగళ వారం 1454 వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎల్.ఎంఎం, ఎంఎంఎస్ఎం, ఎస్టీఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ, వర సాల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ పై స్పష్ట మైన వైఖరి ప్రకటించకుండా ద్వంద వైఖరి అవలంభిస్తోందని అన్నారు. ఇప్పటికే ఉక్కు ఉద్యోగుల తొలగింపులో బాగంగా వీ ఆర్ ఎస్ ప్రకటించిందని అన్నారు. నిన్నటికి నిన్న ఉక్కు లో ఎంతో కీలక మైన సిఐఎస్ఎఫ్ సిబ్బందిని 460 మందిని తొలగించారని విమర్శించారు. ఉక్కు ఉద్యోగులకు 5నెలలు గా వేతనాలు చెల్లించక పోయినా, ఉద్యోగులు అంకిత భావంతో ఉక్కు ఉత్పత్తి లో నిమగ్న మవుతున్నారని అన్నారు. ఉక్కు కర్మాగారం అభివృద్ధి కోసం నిత్యం శ్రమిస్తున్న ఉద్యోగులకు జీతాలు సకాలం లో చెల్లించ కుండా, పేర్దంటేజీల రూపంలో జీతాలు చెల్లించడం దుర్మార్గమన్నారు. ఉక్కులో సిఐఎస్ఎఫ్ స్థానంలో హోం గార్డులులను నియమిస్తే ఉక్కు లో అవినీతి, అక్రమాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఉక్కు సి.ఐఎస్ఎఫ్ వద్ద అధునాతన ఆయుధాలతో పాటు ఉక్కు రక్షణకు ఎంతోకీల కంగా విధులు నిర్వహిస్తారని అన్నారు. తక్షణమే ఉక్కు యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు మానుకొని ఉక్కు ప్రగతికి కృషి చేయాలని డిమాండ్ చేసారు. ఇంకా ఈ దీక్షల్లో ఏ.ఐటియూసి నాయకులు డి. దేముడు, ఎం.త్రినాథ్, జి.ఆనంద్, ఎం.కెవి రాజేశ్వర్ రావు, డి. రమేష్, నంబారు సింహాద్రి, పోరాట కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో దళితులకు తీవ్ర అన్యాయం

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జేవి ప్రభాకర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : జనాభాలో 18 శాతం ఉన్న దళితులకు కేంద్ర బడ్జెట్లో తీవ్ర అన్యా యం జరిగిందని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్య క్షులు జేవి ప్రభాకర్ విమర్శించారు. దళిత హక్కుల పోరాట సమితి, కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో రామ టాకీస్ దగ్గరలో ఉన్న అంబేద్కర్ భవనంలో సోమవారం విలేకరుల సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జే.వి. ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 50 లక్షల 65 వేల కోట్లు రూపాయలు దళితులకు 81 వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉండగా కేవలం 46 వేల కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. 35 వేల కోట్ల రూపాయలు కోత విధించారని తెలిపారు. నేషనల్ ఎస్సీ కమిషన్ కు గత బడ్జెట్లో 71 కోట్ల కేటాయిస్తే ఇప్పుడు 41 కోట్ల రూపాయల కేటాయించారంటే 30 కోట్ల రూపాయలు కోత విధించారు అని డి హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.రాజు అన్నారు. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విదేశీ విద్యా పథకం కింద బడ్జెట్ గత సంవత్సరంలో పోలిస్తే ఇప్పుడు 50 కోట్లు కోత విధించారు అని (కె.వి.పి.ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి తెలిపారు. నేషనల్ షెడ్యూల్ కాస్ట్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (యెన్.ఎస్.ఎఫ్.డి.సి)కి నిధులు కేటాయింపు జరగలేదని, ఇది దుర్మార్గమని డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి జి.రాంబాబు అన్నారు. జీవిత బీమా సంస్థలలో ప్రైవేటు పెట్టుబడులకు 100 శాతం అవకాశం కల్పించడం అంటే దళితులకు ఇన్సూరెన్స్ కంపెనీలలో రిజర్వేషన్లు లేనట్టే అని (కె.వి.పి.ఎస్) జిల్లా అధ్యక్షులు ఎన్ సుబ్బన్న అన్నారు. దళితుల నిరుద్యోగత రేటు (అన్ ఎంప్లాయిమెంట్) గత 40 సంవత్సరంలో ఎప్పుడూ లేనంత నిరుద్యోగత ఎక్కువగా పెరిగింది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్ ప్లాన్ చట్టం చేసి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని, ఆ నిధులు దళితులు అభివృద్ధికే కేటా యించాలని డిమాండ్ చేశారు. పై విష యాలు అన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం బడ్జెట్ సవరణలో చర్చించి నిధులు కేటా యించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డిహెచ్ పియస్ అధ్యక్షులు జెవీప్రభాకర్ జి.రాంబాబు, ఎస్.రాజులు, ఆర్.సత్యవతి కెవిపిఎస్ అధ్యక్షులు సుబ్బన్న, కార్యదర్శి ఎస్ చిరంజీవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో అభివృద్ధి పనులను పరిశీలించిన వీఎంఆర్డీఏ ఎంసీ

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్. విశ్వనాథన్ మంగళవారం విజయనగరం కలెక్టర్ అంబేద్కర్ ని కలిసి వీఎంఆర్డీఏ ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ నుండి అయినాడ వరకు జె.ఎన్.టి.యు., మెడికల్ కాలేజ్ రహదారులను అభివృద్ధి చేయడానికి, రింగ్ రోడ్డు వద్ద ఉన్న పిఎస్ఆర్ పార్కు, కనపాక-అయ్యన్నపేట వుడా కోలనీ పార్కుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో వీఎంఆర్డీఏ జోనల్ ఆఫీసు భవనానికి జరుగుతున్న మరమ్మతులను సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ తో కలసి పరిశీలించి త్వరలోనే ఆనంద గజపతి ఆడిటోరియాన్ని అన్ని వసతులతో ఆధునీకరించి అందుబాటులోకి తీసుకొస్తా మన్నారు. 80 అడుగుల వెడల్పుతో ప్రతిపాదిత జె ఎన్ టి యు బృహత్తర ప్రణాళిక రహదారి, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ రహదారులను, జియ్యన్నవలసలో ఎన్ టి ఆర్ స్మార్ట్ టౌన్ షిప్ లో జరుగుతున్న పనులను కూడా పరిశీలించి నాణ్యతతో సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను, గుత్తే దారును ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీరు బలరామరాజు, ప్లానింగ్ అధికారులు వెంకటేశ్వరరావు, మౌనిక, కార్య నిర్వహక ఇంజినీర్ దుర్గాప్రసాద్, ఉప కార్య నిర్వహక ఇంజనీర్ రమణారావు, సహాయ ఇంజినీర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - అనంద పురం : ఆనంద పురం మండలం, వేముల వలస జంక్షన్లో మంగళ వారం ఉదయం ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పి.పాపారావు పాల్గొని మాట్లాడుతూ ప్రజలు క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆహార అలవాట్లు, వాతా వరణంలో కాలుష్యం, ఇవన్నీ దోహద పడుతున్నాయన్నారు. ఉత్తరాంధ్ర వ్యవస్థపక అధ్యక్షుడు జంగం జోషి, మాట్లాడుతూరీ గుట్కా పాన్ పరాక్, జరద, వంటివి మానాలని, ఎవరికైనా తరచు ఒకే స్థానంలో నొప్పి, స్త్రీలలో అధిక రక్తస్రావం, చాతిలో గడ్డలు ఉన్నట్లు తెలిస్తే, తప్పకుండా డాక్టర్లు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి మండల ప్రెసిడెంట్ పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, కార్యదర్శి, కెఎస్.రావు, పచ్చిపులుసు కనకారావు, రఘు, వినోద్, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సీఎం.డీ మాత్రమే ప్లాంటును గాడిలో పెట్టగలరు : విదసం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : త్యాగాలతో వచ్చిన స్టీలు ప్లాంటు గురించి తెలిసిన తెలుగు సిఎండి మాత్రమే కేంద్రం ఇచ్చిన ప్యాకేజీని సమర్ధంగా వినియోగించి పరిశ్రమను వనరు జ్జీవింప చేయగలరనీ అందుకు ముఖ్యమంత్రే చొరవతీసుకుని కేంద్రాన్ని ఒప్పించాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు డిమాండ్ చేశారు. విశాఖ నగరం అంబేద్కర్ భవన్ లో మంగళవారం జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో వెంకట రావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం ప్రకటించిన ప్యాకేజి లో రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు పాత్ర కీలకమని, ప్యాకేజి ద్వారా ప్లాంటును కాపాడాలన్న చిత్త శుద్ధి కూటమి నేతలకు ఉంటే ఆ సొమ్మును భాద్యత లేని అధికారులు చేతిలో పోస్తే లక్ష్యం నెరవేరదన్నారు . ఇప్పుడున్న సిఎండి, ఇతర ఉత్తరాది రాష్ట్రాల డైరెక్టర్లకు విశాఖ ఉక్కు పోరాట త్యాగాలు తెలియవన్నారు.. ఈ క్లిష్ట పరిస్థితుల్లో పరిశ్రమను తిరిగి నిలబెట్టడానికి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదం, ప్రాణ త్యాగం అర్ధం తెలిసిన తెలుగు అధికారులు కావాలన్నారు. సిఎండి తోపాటు కీలక మైన ఆపరేషన్, కమర్షియల్, ఫైనాన్స్ డైరెక్టర్లనూ తెలుగు వారినే నియమించేలా చంద్ర బాబు కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. అలాగే ప్యాకేజీ నిధుల నుండి ముడి సరుకు కొనుగోలుకు ఆకలితో ఉన్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల జీతాలు చెల్లింపుకు అనుమతి కోరాలన్నారు, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, నీటి చార్జీలు పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పోలవరం, అమరావతి, ఎంపైర్ నిర్మాణానికి విశాఖ ఉక్కునే కొనుగోలు చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకణ జరగదు అని ముఖ్య మంత్రి ప్రదానిచే ప్రకటనలో చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోడ దాసి సుధాకర్, జాజీ ఓంకార్, దళిత సేన నుండి గొల్ల మాల అప్పారావు గుడాల ఈశ్వర రావు, బూల భాస్కర్ రావు, భీమ్ సేన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, రవి శేఖర్, రవి సంతోష్ పాల్గొన్నారు.

దళిత యువతిపై అత్యాచారం చేసి చంపిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - మల్కాపురం : 63వ వార్డు పరిధిలోగల చింతలలోయ గ్రామంలో జంక్షన్ వద్ద ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య ఆధ్వర్యంలో అయోధ్యలో దళిత యువతిపై అత్యాచారం చేసి చంపిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఏపీ మహిళా సమైక్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల జయ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 76 సంవత్సరాలు అయినా మహిళలకు రక్షణ లేదని మహిళా చట్టాలను తుంగలోకి తొక్కారని ఎక్కడ చూసినా మహిళలపై మానభంగాలు హత్యలు విపరీతంగా పెరుగుతున్నాయి ఉత్తరప్రదేశ్లో జరిగిన దళిత యువతపై అత్యాచారం చేసిన వారిని తక్షణమే బహిరంగముగా ఉరితీయాలని మహిళా సమాఖ్య డిమాండ్ చేయడం జరిగింది ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న అరాచకాలను హత్యలను అరికట్టాలని మరియు మహిళలకు రక్షణలు ఇచ్చే చట్టాలను పటిష్టం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళ నాయకురాలు పందిరి జయలక్ష్మి ముత్యాలమ్మ అచ్చి అమ్మ మరియు పి.రమనాగమణి మరియు బోనుల అచ్చమ్మ, రమ, పావని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మూడు నామినేషన్లు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఉత్త రాంధ్ర జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. 03వ తేదీన నోటిఫికేషన్ వెలువడిన తొలి రోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోగా రెండో రోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ను తన కార్యాలయంలో కలిసి సంబంధిత పత్రాలను సమర్పించారు. అనంతరం ఆర్వో సమక్షంలో ప్రమాణం చేశారు. ఏపీటీఎఫ్ మద్దతుదారుగా బరిలోకి దిగిన పాకలపాటి రఘువర్మ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అంద జేయగా, కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి ఒక్కో సెట్ పత్రాలను ఆర్వోకు సమ ర్పించారు. రఘువర్మ వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఇతర మద్దతుదారులు విచ్చేశారు. ఏఆర్వో బీహెచ్ భవానీ శంకర్, నోడల్ అధికారి దయానిధి, ఎన్నికల సెల్ అధికారులు సంబంధిత సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి అభ్యర్థులకు సహాయ సహకారాలు అందజేశారు.

పెళ్ళిళ్ళు నిర్వహించేందుకు టెండర్లు ఇకపై పిలువరాదు

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ సింహాగిరిపై ప్రైవేట్ కాంట్రాక్ట్ పెళ్ళిళ్ళ టెండర్ రద్దు చేయాలని హిందూ ధార్మిక ప్రచార జేఏసి కన్వీనర్ పూడిపెద్ది శర్మ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయనకు రాష్ట్ర నలుమూలల నుండి మద్దతు పెరుగుతోంది. సింహాచలం దేవస్థానం కొండపైన పెళ్ళిళ్ళు చేసుకునేందుకు టెండర్ పిలిచిన సంగతి పాఠకులకు తెలిసిందే. అయితే ఆ టెండర్ ఈ ఏడాది జనవరి 31తో రద్దు అయింది. గుత్తేదారు ఇక్కడ కొంత మంది అధికార్ల సలహా సూచనలతో కోర్టు అర్డర్ తెచ్చి ఇటీవల కొత్తగా పిలిచిన బహిరంగ వేలం పాట రద్దు చేసిన సంగతి తెలిసిందే. కానీ అధికారులు అండ దండలతో పాత టెండర్ ను కొనసాగిస్తున్నారు అని తక్షణమే ఆ టెండర్ రద్దు చేసి ఇకపై పెళ్ళిళ్ళు నిర్వహించటానికి టెండర్లు పిలువ రాదని శర్మ అంటున్నారు. ఆ టెండర్ వలన పేద, సామాన్య ప్రజలు పెళ్ళిళ్ళు పేరుతో ఆర్థికంగా నష్ట పోతున్నారని అయన వాదన.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం మండలంలో వెల్లంకి వేములవలస గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి కె. అప్పలస్వామి , మండల వ్యవసాయ అధికారిని సంధ్య రత్న ప్రభ పాల్గొని, వరి పంట నారు మడులను సందర్శించారు. నాటు కోసం ప్రధాన పొలాన్ని సిద్ధం చేసుకునేటప్పుడు వరి నారు వయస్సు 25 నుండి 30 రోజులు మించకుండా చూసుకోవాలి. నాటు వేసే ముందు రెండు నుండి మూడు సార్లు వారం రోజుల వ్యవధిలో పొలాన్ని దమ్ము చెయ్యాలని. ఇలా చేస్తే కలుపు మొక్కలను పూర్తిగా నాశనం చేయొచ్చని తెలిపారు . చివరి దమ్ములో ఎకరానికి ఒక్క బస్తా డి ఎ పి (50 కిలోలు) ం యూరియ 10 కిలోలు ం మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 10 కిలోలు చేసి నాటు వెయ్యాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ విస్తరణ అధికారి బి.స్వాతి, వెల్లంకి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ జి. రమేష్ రైతులు పాల్గొన్నారు.

వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ బృందం

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 92వ వార్డు ఆర్ఆర్ వెంకటాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు నాగరాజు ఆధ్వర్యంలో బృందం సందర్శించింది. సోమవారం ఉదయం ఆర్ఆర్ వెంకటాపురం ఉన్నత పాఠశాల తరగతి గదిలో దుర్వాసన రావడంతో కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో పాటు వాంతులు చేసుకోవడంతో స్కూల్ యాజమాన్యం విద్యార్థులను హాస్పటల్ లో చేర్పించి వైద్యం చేయించింది. ఈ సంఘటనపై ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.నాగరాజు బృందం స్పందించి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అక్కడే ఉన్న డిప్యూటీ డీఈవో సోమేశ్వర రావు, ఎంఈవో దివాకర్‌లను వివరణ అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి వారు తింటున్న భోజనం పరిశీలించి దుర్వాసన వచ్చిన తరగతి గదిని పరిశీలించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని తరగతి గదిలో ఏదో తెలియని దుర్వాసన రావడంతో ఆ విధంగా జరిగిందని ప్రస్తుతం ఇక్కడ ఎటువంటి ఇబ్బందులు లేవని విద్యార్థులు తెలియజేసినట్లు ఏఐఎస్ఎఫ్ సభ్యులు చెప్పారు. అలాగే హెచ్ఎంతో ఇటువంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా ప్రతిరోజు తరగతి గదులు శుభ్రం చేయించాలని విద్యార్థుల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శేఖర్, ఉపాధ్యక్షుడు బి.కిరణ్ సహాయ కార్యదర్శి హేమంత్, సభ్యులు సిద్ధూ పాల్గొన్నారు.

క్రీడలు ప్రోత్సాహం కోసం స్టేడియంలు నిర్మిస్తాం : ఎమ్మెల్యే పల్లా

కరాటే ఛాంపియన్‌షిప్ గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - గాజువాక : నియోజకవర్గంలో క్రీడలు ప్రోత్సాహం కోసం స్టేడియంల నిర్మాణం చేపడ తమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చెప్పారు. 10 ఆగస్టు 2025వ తారీకున జరగ బోయే మిద్దె లక్ష్మీనారాయణ మెమోరియల్ సౌత్ ఇండియా ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ గోడ పత్రిక ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. గాజువాక లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతి భా వంతమైన క్రీడాకారులు వున్నారన్నారు.వారిని ప్రోత్సాహించడానికి తగిన చర్యలు చేపడతా మన్నారు. ఆర్గనైజేడ్ బై విశాఖ లైన్స్ షోటోఖాన్ కరాటే డో అసోసియేషన్ ఆఫిలిటెడ్, బై గ్లోబల్ షోటోఖాన్ కరాటే డో ఇండియా ఆధ్వర్యంలో ఈ ఛాంపియన్ షిప్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇండియా ఛీఫ్ హన్షి పి.వెంకటేశం, ఫౌండర్ అండ్ డైరెక్టర్ టోర్నమెంట్ ప్రెసిడెంట్ గా వ్యవహరిస్తున్నారు. టోర్నమెంట్ ఛీఫ్ ఆర్గనైజర్ డి.ప్రేమ్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ఛీఫ్, టోర్నమెంట్ ఆర్గనైజర్ మిద్దె వీరాంజనేయులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యూ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గంటా నూకరాజు, రాష్ట్ర కార్యదర్శి టోర్నమెంట్ ఆర్గనైజర్ జిసిఎస్ వర్మ, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

సింహాద్రి పై వైభవంగా రథసప్తమి వేడుకలు

విశాలాంధ్ర - సింహాచలం : మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయం లోను, కృష్ణాపురం గోశాలలో రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యనిర్వహణాధికారి వి త్రినాధరావు ఆదేశాల మేరకు ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆలయ ఈశాన్య భాగంలో ఉన్న రాతి రథం పైన ఉదయం 7 గం లకు సింహాద్రి నాథుని ఉత్సవ మూర్తులు అయిన గోవిందరాజుల స్వామి, అమ్మవార్లను అర్చకులు కొలువు తీర్చారు. పంచామృత స్నపన తిరుమంజనం, ఆరాధనలు అర్చక స్వాములు జరిపించారు. అనంతరం నిత్యకళ్యాణం జరిగింది. సాయంత్రం కొండపైన మాడ విధుల్లో సూర్యప్రభ వాహనంపై తిరువీధి జరిగింది. ఏడాదిలో ఒక్కసారే..: సింహాచలం ఆలయంలో రాతి రథానికి ఎంతో విశిష్టత ఉంది. గ్రామీణ కథనం ప్రకారం అప్పన్న ఆలయాన్ని నిర్మించిన శిల్పికుమారుడు తండ్రిపై కోపంతో ఈ రథంతో ఆలయాన్ని తూర్పు దిశ నుంచి పశ్చిమ దిశకు మార్పు చేసినట్లు జానపదుల కథనం. ఈ నేపథ్యంలో ఇతర ఆలయాలకు భిన్నంగా అప్పన్న స్వామి ఆలయం పశ్చిమాభిముఖంగా ఉంటుంది. ఏడాదిలో ఒక్క రథసప్తమి రోజున మాత్రమే (ససింహాద్రి నాథుడిని సూర్య నారాయణమూర్తిగా రాతిరథం పై అధిష్టించి విశేష ఆరాధనలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఆరోజు నిత్యకల్యాణోత్సవం కూడా రాతిరథంపై జరగడం విశేషం. అపురూపమైన శిల్ప చాతుర్యంతో ఉండే రాతిరథం అప్పన్న ఆలయంలో ప్రత్యేక ఆకర్షణ. అదేవిధంగా కృష్ణాపురం గోశాలలో సూర్యనారాయణ మూర్తిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 98వ వార్డ్ కార్పొరేటర్ పీవీ దర్శించుకున్నారు. ఉదయం 4గం ల నుండి భక్తులు పోటెత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్యాన్సర్‌పై 'యూనిఫై టు నోటిఫై' జాతీయ క్యాంపెయిన్ ప్రారంభం

ఆపోలో క్యాన్సర్ సెంటర్, ఐసీఎంఆర్, ఐఎంఏ, రాష్ట్ర ఆంకాలజీ సంఘాల ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యతిరేక పోరాటం

విశాలాంధ్ర - విశాఖపట్నం : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అపోలో క్యాన్సర్ సెంటర్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), రాష్ట్ర ఆంకాలజీ సంఘాలు సంయుక్తంగా అపోలో క్యాన్సర్ సెంటర్ (ఆరిలోవ)లో 'యూనిఫై టు నోటిఫై' అనే జాతీయ క్యాంపెయిన్‌ను ముఖ్య అతిథి, ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఐ వాణి, గౌరవ అతిథి, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మురళీ మోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖలోని అపోలో క్యాన్సర్ సెంటర్స్ సీనియర్ మెడికల్, హేమేటో ఆంకాలజిస్ట్ డాక్టర్ రాకేష్ రెడ్డి బోయా, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వేంట్రపాటి ప్రదీప్, సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సుమన్ దాస్, చీఫ్ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎంపీఎస్ చంద్ర కళ్యాణ్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జయశ్రీ, డాక్టర్ ఆదిత్య నారాయణ్, డాక్టర్ బ్రహ్మాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ ఈ క్యాంపెయిన్ భారత ప్రభుత్వం క్యాన్సర్‌ను గుర్తించదగిన వ్యాధిగా గుర్తించాలనే విజ్ఞప్తితో ముందుకు వెళ్తుందన్నారు. ఇది క్యాన్సర్ వ్యతిరేక పోరాటంలో కీలకమైన అడుగుగా చెప్పవచ్చన్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. 2025 నాటికి ఈ సంఖ్య 15.7 లక్షలకు పెరిగే అవకాశం ఉందన్నారు.

బెహరా కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పెందుర్తి : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నరవలోని బెహరా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందుమతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్యాన్సర్ పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి నివారణకు విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. బెహరా విద్యాసంస్థల సెక్రటరీ డా. బెహరా చైతన్య ఆదేశాలతో ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్లో విద్యార్థిని విద్యార్థులకు క్యాన్సర్ ప్రాథమిక లక్షణాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న జరుపుకునే ప్రపంచ క్యాన్సర్ అవేర్నెస్ దినోత్సవం సందర్భంగా ఫ్ల కార్డులతో ప్రదర్శన చేపట్టారు. అధిక రక్తస్రావం, బరువు తగ్గడం, నిరంతర నొప్పి, ఎక్కువ అలసట, చర్మం మార్పులు గొంతు మార్పులు గడ్డల వాపులు, నయం చేయని పుండ్లు, చేయి లేదా భుజంలో బలహీనత లేదా తిమ్మిరి, విపరీతమైన దాహం తరచుగా మూత్రవిసర్జన, ఊపిరి ఆడకపోవడం దగ్గు ఎక్కువగా రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైస్ ప్రిన్సిపల్ అనుష ప్రియా అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ దివ్య, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యానికి ఎన్డీయే ప్రభుత్వం అగ్రతాంబూలం : భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - విశాఖ సిటీ : విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీయే ప్రభుత్వం విశేష ప్రాధాన్యమిస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరిలోవలోని ఒమేగా ఆస్పత్రిలో మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వాహనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో దేశంలో 200 జిల్లాల్లో క్యాన్సర్ కేంద్రాలను కేంద్ర బడ్జెట్ లో ప్రతిపాదించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, జీవన శైలి మార్చుకుంటే క్యాన్సర్ రాకుండా నిరోధించ వచ్చన్నారు. ప్రాథమిక దశలో క్యాన్సర్ ను గుర్తించినా అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్స విధానాలతో నివారించవచ్చని తెలిపారు. క్రికెటర్ యువరాజ్ సింగ్, సినీనటులు మనీషా కొయిరాలా, గౌతమి, సోనాలి బింద్రే లాంటి సెలబ్రిటీలు క్యాన్సర్ ను జయించి స్ఫూర్తిగా నిలిచారన్నారు. రాష్ట్రంలో బసవ తారకం, ఒమేగా, హెూమీ బాబా, మహాత్మా గాంధీ తదితర క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ లు క్యాన్సర్ నివారణలో వస్తున్న ఆధునిక చికిత్స విధా నాలను అందిపుచ్చుకుంటున్నాయని ప్రశంసించారు. చికిత్స తీసుకుంటూ మనో ధైర్యం కోల్పోకుండా ఉన్న క్యాన్సర్ రోగులు సాధారణ స్థితికి చేరుకుంటున్నారని, 23 ఏళ్లు క్యాన్సర్ పై పోరాడిన అర్జున్ సేన్ జీవితాన్ని ఉదహరించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం రోజునే కాకుండా మిగిలిన రోజుల్లో కూడా ఆ వ్యాధిపై అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనతో ప్రారంభమైన హెల్త్ సిటీ విశాఖ వాసులకు ఒకే ప్రాంతంలో సకల వైద్య సదుపాయాలు అందుతున్నాయని చెప్పారు. ఒమేగా హాస్పటల్ ఎండీ డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వాహనంలో మామోగ్రఫీ, పాప్ స్మియర్, అల్ట్రా సౌండ్ తదితర సౌకర్యాలు ఉంటాయన్నారు. డాక్టర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

విశాలాంధ్ర – తగరపువలస : స్థానిక ఒకటవ వార్డు, జి వి యం సి ప్రాథమిక పాఠశాల, బంగ్లామెట్ట నందు ఉపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, నరహరశెట్టి రమేష్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు చాత్రోపాధ్యాయులు క్యాన్సర్ పై అవగాహన నాటకాన్ని ప్రదర్శించారు. కాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు ప్రతీయేట ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంగా పాటిస్తారని ఈ రోజును యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ చే స్థాపించబడిందని, క్యాన్సర్ వల్ల అనారోగ్యం, మరణం గణనీయంగా తగ్గించటమే దీని లక్ష్యమని తెలియజేశారు. క్యాన్సర్ తో బాధపడుతున్నవారికి మద్దతు ఇవ్వడానికి ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంలో అనేక కార్యక్రమాలు అమలులో ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా మరణాలకు క్యాన్సర్ రెండవ ప్రధాన కారణమని ప్రతి సంవత్సరం లక్షలాది కొత్త కేసులు మరియు మరణాలు సంభవిస్తున్నాయని ఇది నిర్ధారణ అయిన వ్యక్తులను మాత్రమే ప్రభావితం చేయదు ఇది కుటుంబాలు, సమాజాలు మరియు మొత్తం దేశాలలో వ్యాపిస్తుందని మనం భవిష్యత్తు వైపు చూస్తున్నప్పుడు, ముఖ్యంగా తక్కువ మరియు మధ్య-ఆదాయ దేశాలలో క్యాన్సర్ కేసులు మరియు మరణాలలో అంచనా వేయబడిన పెరుగుదల, క్యాన్సర్ సంరక్షణ, నివారణ మరియు పరిశోధన చొరవలలో తక్షణ ప్రతిస్పందన అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఈగల సంజీవి, ఛాత్రోపాధ్యాయులు రాహేలు, కృష్ణవేణి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదుర్గాలమ్మ గుడికి వెళ్లే ఈ రోడ్డు అడ్డగింత

విశాలాంధ్ర – భీమిలి : స్థానిక సంగివలస శశి కళాశాల వెనుక ఉన్న రహదారి మార్గానికి ఉన్న అడ్డంకులు తొలగించాలని స్థానికులు, (చోడిపిల్లి గంగాధరరావు) మంగళవారం పత్రికా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగివలస గ్రామం సర్వే నెంబర్ 25/6,23/9 లో అర కిలోమీటర్ పొడవైన రోడ్డు అడంగల్ లో రహదారిగా వర్గీకరించారని, 1959లో ఆంధ్రప్రదేశ్ గెజిట్ లో ప్రచురించబడిన సంగివలస రెవెన్యూ విలేజ్ మ్యాప్లో బండి బాటగా గుర్తించారని, ఎఫ్ఎంబిలను జతచేసి పరిశీలించగా ఒకే రహదారిలో భాగమని స్పష్టం మగుచున్నది,రోడ్డు వెంబడి గ్రామ మురుగు కాలువ ప్రవహిస్తుందని కొందరు వ్యక్తులు అడ్డుకోవడం వలన మురుగునీరు పొంగి ప్రజారోగ్యానికి హాని కలుగు తుందని,స్థానికులు మరియు శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మ గుడిని సందర్శించే భక్తులు, ఇతరులు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తారు, ఈ క్రమం లో సుమారు రెండు నెలల క్రితం కొంతమంది వ్యక్తులు రహదారినిని అడ్డుకోవడం ఈ రోడ్డు వాళ్ళదే నని అడ్డుగా సిమెంట్ పోల్స్ పాతి కంచె వేయడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నదనీ గ్రామస్తులు ఆందోళన చేశారు, పైన పేర్కొన్న వాస్తవాలను పరిగణలోకి తీసుకొని రహదారిగా మార్చవలసిందిగా కోరారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ మరియు స్థానిక మండల తహసీల్దారు వారికి వినతి పత్రం అందజేసామని తెలియజేశారు. ఘటనా స్థలానికి రెవెన్యూ ఆర్ ఐ మల్లేశ్వర రావు, వీఆర్ఓ, పోలీసు సిబ్బంది చేరుకొని రికార్డులను పరిశీలించి ఇరువర్గాలను ఎంఆర్ఓ కార్యాలయానికి రావాలన్నారు. సమన్వయం పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు చోడిపిల్లి నాగరాజు, నమ్మి సూరిబాబు, చందక సూరి, కొనాడ శ్రీను, సి.హెచ్.రాములమ్మ, కే.త్రినాథరావు, కిలారీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల వల్ల యువత లక్ష్యానికి చేరువవుతారు

ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్ : క్రీడల వల్ల యువత తమ లక్ష్యానికి చేరువవుతారని, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు అన్నారు. వికింగ్స్ పికిల్ బాల్ ఓపెన్ టోర్నమెంట్ను సాగరనగర్ స్మాష్ పికిల్ బాల్ క్లబ్ నిర్వహించింది .సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో సింగిల్స్ లో 32 మంది క్రీడాకారులు పాల్గొనగా, డబుల్స్ లో 40 మంది తల పడ్డారు. హెరాహోరీగా సాగిన ఈ మ్యాచ్లో క్రీడా కారులు తమ ప్రతిభను చాటారు. ఈ పికిల్ బాల్ పోటీలకు వివిధ క్లబ్ల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. సింగిల్స్ విభాగంలో ఛాంపియన్ షిప్ ట్రోఫీని చిరాగ్ సొంతం చేసుకున్నాడు. ద్వితీయ స్థానంలో రోహిత్ వర్మ నిలిచారు. డబుల్స్ ఫైనల్స్ కూడా హెరాహోరీగా సాగింది. వీక్షకుల్ని ఉత్కంఠకు గురి చేసింది. మూడు సెట్స్ ఆడిన క్రీడాకారులు హమాదన్, శ్రవణ్ అద్భుత ప్రదర్శనతో ట్రోఫీని సొంతం చేసుకున్నారు. ద్వితీయ స్థానంలో విరాజ్, అఖిల్ నిలిచారు. విజేతలకు మాజీ మంత్రి, ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు బహుమతులందజేశారు. ఈ టోర్నమెంట్ లో ఓ క్రీడాకారుడిగా కూడా ఆయన హాజరై అందర్నీ ఉత్సాహ పరిచారు.

యుఎల్సీ భూముల క్రమబద్ధీకరణకు అవకాశం

విశాలాంధ్ర – విశాఖ కలెక్టర్ : పట్టణ గరిష్ట పరిమితి చట్టం ఆక్ట్ 1976 ప్రకారం విశాఖపట్నం అర్బన్ పరిధిలో ప్రకటించబడిన మిగుల భూముల ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రస్తుతము అమలులో ఉన్న జీఓ.36 రెవిన్యూ విభాగం సవరణ చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జీఓ 84ను జారీ చేశారు. ఈ జీఓ ప్రకారం దరఖాస్తులు స్వీకరించటానికి గడువు 31.12.2023 తో ముగిసింది. తిరిగి ప్రభుత్వము మిగుల భూములలోని ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు మరో అవకాశం కల్పించింది. తేదీ 31.12.2025 లోగా దరఖాస్తు చేసుకోవలసిందిగా పేర్కొన్నారు.

మిగుల భూముల ఆక్రమణలను జి ఓ లలోని నిబంధనల పరిధికి లోబడి క్రమబద్ధీకరణ చేయుట కొరకు ఆక్రమణదారులు తేదీ.01.05.2019 కి ముందు నుండి సదరు భూమి వారి ఆక్రమణలో ఉన్నట్టుగా పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, నిర్మాణం యొక్క జీవిఎంసీ ప్లాన్, ఇంటి పన్ను రసీదు, కరెంటు బిల్ , వాటరు టాక్స్ రసీదులతో పాటుగా దరఖాస్తును సంబందిత తహసిల్దార్ వారి కార్యాలయములో డిసెంబర్ 31 లోగా దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.

జీఓలో పొందుపరిచినట్టుగా 0–150 చదరపు గజములకు డి పట్టా ఉచితముగా కేటాయించబడును. 151 చదరపు గజములు పైబడి 300 చదరపు గజముల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ బేసిక్ వేల్యూ కి 15 శాతం ,300 చదరపు గజములు పై బడి 500 గజముల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ బేసిక్ వేల్యూకు 30 శాతం చెల్లించాల్సి ఉంటుంది. 500 గజముల పై బడిన వాటికి ప్రస్తుత రిజిస్ట్రేషన్ బేసిక్ వేల్యూకు 100 శాతం విలువను లెక్కించి అందులో మొదటి విడతగా 50 శాతం నగదును డిమాండ్ డ్రాఫ్ట్ లేదా బ్యాంకర్ చెక్కు తీసి సమర్పించాలి. జాయింట్ కలెక్టర్ లేదా సంబంధిత ల్యాండ్ సీలింగ్ అథారిటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకై సంబంధిత మండల తహసిల్దార్ వారి కార్యాలయం లో సంప్రదించవలసిందిగా తెలియజేశారు.

పది అడుగులు దారిస్తే 30 అడుగుల దారి అంటున్నారు : తోనంగి అప్పయ్యమ్మ

విశాలాంధ్ర – భీమిలి : భీమిలి మున్సిపాలిటీ సంగి వలస సర్వే నంబర్ 25/6 సుమారు 70 సెంట్లు భూమి నాకు చిల్ల ముత్యాలమ్మ ద్వారా వారసత్వంగా సంబంధించిందని అందులో 35 సెంట్లు భూమి ఇతరులకు క్రయపరచగా మిగిలిన 35 సెంట్లు భూమిని పంపకం చేసుకోగా తూర్పు దిశగా పది అడుగుల రాస్తాను శ్రీ దుర్గాలమ్మ గుడికి ఉమ్మడి రాస్తాగా ఇవ్వడం జరిగిందని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నా భూమిని 30 అడుగుల ప్రభుత్వ భూమి రాస్తాగా చూపించి తప్పుడుగా చిత్రీకరిస్తున్నారని రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించాలని మాకు సంబంధించిన జురాయితీ భూమిని సానుభూతితో పది అడుగులు రాస్తా ఇస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారులు 30 అడుగులుగా చూపించి వ్యాపారాలు చేసుకుంటున్నారని వాళ్ల వైఖరికి రోడ్డు బందు చేశానని తోనంగి అప్పయ్యమ్మ చెప్పారు వచ్చిన వారంతా వలందపేట గ్రామస్తులు కాదని అంతా రియల్ ఎస్టేట్ వ్యాపారులని 30 అడుగులు వెడల్పు రోడ్డు లేకపోతే వాళ్ల నిర్మాణాలు చేపట్టడానికి పర్మిషన్లు ఉండవని నా జరాయితీ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా చిత్రీకరించడానికి చూస్తున్నారని ఆమె అన్నారు.